# రోడ్లపైనే పార్కింగ్

- నిత్యం రద్దీగా రామ్‌నగర్ - పెదవాల్తేరు రోడ్డు
- షాపుల ముందే పార్కింగ్ చేస్తున్న వాహనదారులు
- నో పార్కింగ్ బోర్డులున్న చోటా ఇదే పరిస్థితి
- సాయంత్రం సమయంలో రద్దీతో రాకపోకలకు అవస్థలు
- చోద్యం చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు


రామ్‌నగర్ నుంచి సిరిపురం సర్కిల్ వైపు వెళ్లే మార్గంలో నో పార్కింగ్ బోర్డు వద్ద నిలిపిన వాహనాలు

బీచ్‌రోడ్డు : పొట్టకూటి కోసం ఎన్నో ఏళ్లుగా చిరు వ్యాపారులు ఫుట్‌పాత్‌లపై బండి పెట్టుకుని వ్యాపారం చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులని తొలగించేసే జీవీఎంసీ, నగర పోలీసులకు బడా షాపుల వల్ల కలిగే ట్రాఫిక్ కష్టాలు కనిపించడం లేదు. ఫుట్‌పాత్‌లు సాధారణ ప్రజలు నడిచేందుకని చెప్పే అధికారులకు బడా షాపులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నా అటువైపు మాత్రం కన్నెత్తి చూడడం లేదు. ఇందుకు నిదర్శనమే నిరంతరం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రామ్‌నగర్ - పెదవాల్తేరు రోడ్డు. రామ్‌నగర్ నుంచి పెదవాల్తేరు.. పెదవాల్తేరు నుంచి రామ్‌నగర్ వెళ్లే మార్గంలో ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో సాయంత్రం సమయంలో రాకపోకలకు వీలు లేకుండా పోతోంది. రోడ్డు మీద నో పార్కింగ్ అని సైన్ బోర్డులు పెట్టినప్పటికీ అక్కడే వాహనాలు నిలిపేసి ట్రాఫిక్ పోలీసులకు వాహనదారులు సవాల్ విసిరుతున్నారు. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు తప్ప కఠిన చర్యలు తీసుకోవడం లేదు.

**రోడ్డు మీద పార్కింగ్ చేసి షాపుల్లోకి...**

రామ్‌నగర్ నుంచి పెదవాల్తేరు వైపుగా వెళ్తున్న రోడ్డు మార్గంలో నిరంతరం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలోనే ప్రముఖ స్వీట్ షాపులు, రెస్టారెంట్లు, చిన్నపిల్లల బొమ్మల షాపులు, పెద్ద పెద్ద షాపింగ్ మాల్‌లు ఉండడంతో వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేసి షాపుల్లోకి వెళ్తున్నారు. ముఖ్యంగా కేర్ హాస్పిటల్ నుంచి ద్రోణంరాజు సర్కిల్ వరకు వాహనాలు ఇష్టారాజ్యంగా నిలిపేస్తున్నారు. దీంతో సాయంత్రం సమయంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రోడ్డుపైన ఎక్కడికక్కడే ట్రాఫిక్ పోలీసులు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ వాహనదారులు అవే బోర్డులు వద్ద పార్కింగ్ చేసి ట్రాఫిక్ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలు ఆ బోర్డుల చుట్టూ నిలిపేసి షాపుల్లోకి వెళ్లిపోతున్నారు. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు మాత్రం తమకేమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారు..


నో పార్కింగ్ బోర్డు వద్ద నిలిపిన వాహనాలు

**రోడ్డా..? పార్కింగ్ స్థలమా..?**

రామ్‌నగర్ నుంచి ద్రోణంరాజు సర్కిల్ వైపు రోడ్డు మార్గంలో వాహనాల నిలుపుదల ఒకరకంగా ఉంటే.. ద్రోణంరాజు సర్కిల్ నుంచి రామ్‌నగర్ వైపు వెళ్లే మార్గంలో వాహనాల పార్కింగ్ మరీ దారుణంగా ఉంది. ఇక్కడ చూస్తే అసలు రోడ్డా..? లేక పార్కింగ్ స్థలమా..? అనే సందేహం కలుగుతుంది. ఆ ప్రాంతంలో కొన్ని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉండడంతో రోడ్డు మీదనే ద్విచక్ర వాహనాలు భారీ సంఖ్యలో పార్కింగ్ చేస్తున్నారు.

**ట్రాఫిక్ పోలీసుల చర్యలు శూన్యం**

నగర పోలీస్ కమిషనర్‌గా శంఖబ్రత బాగ్చి బాధ్యతలు స్వీకరించిన కొత్తలో రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాల విషయంలో హడావిడి చేసిన ట్రాఫిక్ పోలీసులు ప్రస్తుతం చోద్యం చూస్తున్నారు. భారీ సంఖ్యలో రోడ్డు మీద వాహనాలు నిలుపుతున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తూ వదిలేస్తున్నారు. దీంతో సాయంత్రం సమయంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రముఖులు ప్రయాణించే మార్గంలోని ట్రాఫిక్ ఇబ్బందులను మాత్రం పట్టించుకోకుండా బడా షాపులకు సహకరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ మార్గం ద్వారానే ప్రభుత్వ అతిథి గృహానికి.. పోర్టు అతిథి గృహానికి.. నావికాదళ అధికారుల అతిథి గృహానికి.. బీచ్ రోడ్‌లోని స్టార్ హోటల్స్‌కు ప్రముఖులు రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి రహదారిపై వాహనాలను ఇష్టమొచ్చినట్లు పార్కింగ్ చేస్తున్నప్పటికీ ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


సిరిపురం సర్కిల్ నుంచి రామ్‌నగర్ వైపు వెళ్లే రోడ్డుపై పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు


ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న రామ్‌నగర్‌లోని ఒక పెద్ద షాపు

**జరిమానాలు విధించడంపైనే శ్రద్ధ**

రామ్‌నగర్ మెయిన్ రోడ్డులో ఇంతలా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించేలా వాహనాలు పార్కింగ్ చేస్తున్నా ట్రాఫిక్ పోలీసులు ఆ విషయాన్ని గాలికి వదిలేస్తున్నారు. కేవలం వాహనదారులను ఆపి జరిమానాలు వేసి చేతులు దులిపేసుకుంటున్నారు. రోజూ సిరిపురం సర్కిల్ వద్ద ఒక ఏఎస్ఐ, సిబ్బంది వాహనాలు ఆపి జరిమానాలు వేస్తుంటారు తప్ప పక్కనే రోడ్డు మీద భారీగా వాహనాలు ఆపి షాపుల్లోకి వెళ్తుంటే మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని... షాపుల ముందు బడా వ్యాపారులు ఆక్రమించిన ఫుట్‌పాత్‌లను క్లియర్ చేయాలని పలువురు కోరుతున్నారు.

## క్లుప్తంగా

### ఏపీ ఫిజికల్ సైన్స్ ఫోరం కోశాధికారిగా రాజారావు



ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రాష్ట్ర శాఖ కోశాధికారిగా జిల్లాకు చెందిన పాలగుమ్మి రాజారావు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం జిల్లాలోని పెదగంట్యాడ మండలం గంగవరం ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విజయవాడలో శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్నట్లు రాజారావు ఆదివారం తెలిపారు. జిల్లాలో ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం అధ్యక్షుడిగా పదేళ్లుగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పదవి కోసం తనను ఎన్నుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో 26 జిల్లాల కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు మేలు కలిగేలా ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం పనిచేస్తుందని తెలిపారు. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

### కాంగ్రెస్ సంతకాల సేకరణ


సంతకాల సేకరణలో కాంగ్రెస్ నాయకులు


మద్దిలపాలెం : ఏఐసీసీ పిలుపు మేరకు ఓట్ చోర్-గద్దె చోడ్ నినాదాలు చేస్తూ కాంగ్రెస్ నాయకులు సంతకాలు సేకరించారు. బీజేపీ, కేంద్ర ఎన్నికల సంఘం కలిసి చేస్తున్న కుట్రలను పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రియాంక దండి, నాయకులు ఈగల మోహన్ సాయి, వంటాకు వినోద్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కృష్ణ కాలేజీ రోడ్డులో ప్రజలకు ఆదివారం వివరించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ దేశంలో ఈసీ సహాయంతో బీజేపీ అధికారంలోకి వస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో కాండవ గాయత్రి, మహమ్మద్ ఆలీ, వేమూరి సురేష్, గుర్రం కనకరాజు, మామిడి వరాలమ్మ, భోగవరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : హరే కృష్ణ, హరే రామ అంటూ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో హరినామ స్మరణ ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజలు సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలు, ప్రవచనాలు ఆలపించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

### నేత్రపర్వంగా నిత్య కల్యాణం


నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

**వైభవంగా స్వర్ణ పుష్పార్చన**

శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంచేపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర పూజ చేశారు. దాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

## ఫుట్‌పాత్‌లు శిథిలం

ఆరిలోవ : బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని కొండవాలు ప్రాంతం సర్వీస్ రోడ్డులో ఫుట్‌పాత్‌లు శిథిలమైపోతున్నాయి. దీంతో పాదచారులు నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. హనుమంతవాక నుంచి క్రాంతినగర్, సంజయ్‌గాంధీకాలనీ, సింహగిరి కాలనీ వరకు పలుచోట్ల ఫుట్‌పాత్‌లపై పలకలు ఊడిపోయాయి. కొన్నిచోట్ల గోతులు ఏర్పడ్డాయి. దీంతో నడవడానికి ఇబ్బంది పడుతున్నామని ఆయా కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తూ సామగ్రి నిల్వ చేయడం, కార్లు పార్కింగ్ చేయడంతో పలకలు ఊడిపోతున్నాయని స్థానికులు తెలిపారు. వీటికి మరమ్మతులు చేయించాలని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయా చోట్ల ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


క్రాంతినగర్ సర్వీస్ రోడ్డులో శిథిలమైన ఫుట్‌పాత్


సింహగిరికాలనీ వద్ద శిథిలమైన ఫుట్‌పాత్

## ‘అంకెల మామయ్య’.. భలే శిక్షణ ఇచ్చాడు..


మొబైల్ డి-అడిక్షన్‌పై వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

- ‘మొబైల్ డి-అడిక్షన్, ఫన్ మ్యాథ్స్, చిట్టి ప్రయోగాలు’ పై విద్యార్థులకు శిక్షణ

మద్దిలపాలెం: పిల్లలను మొబైల్ ఫోన్‌ల వ్యసనం నుంచి దూరం చేసి, వారిలో సృజనాత్మకతను, ఏకాగ్రతను పెంచే లక్ష్యంతో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శివాజీపాలెంలో ఆదివారం ఒక ప్రత్యేకమైన వర్క్‌షాప్ నిర్వహించారు. ‘మొబైల్ డి-అడిక్షన్, ఫన్ మ్యాథ్స్, చిట్టి ప్రయోగాలు’ అనే ఈ కార్యక్రమంలో ప్రముఖ మెజీషియన్, ‘అంకెల మామయ్య’ చంద్రయ్య శిక్షణ ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో భాగంగా చంద్రయ్య సైన్స్ సూత్రాలను చిన్న చిన్న ప్రయోగాల ద్వారా చిన్నారులకు అర్థమయ్యే విధంగా వివరించారు.

హిప్నోటిక్ స్ట్రా, ఎగిరే స్ట్రా, తిరుగుతున్న స్ట్రా, మ్యాచ్ బాక్స్ రైలు, విధేయుడైన అగ్గిపెట్టె, సింపుల్ యానిమేషన్, పేపర్ విజిల్, అరచేతిలో మ్యాజిక్ వంటి ఆసక్తికరమైన అంశాలతో పిల్లలు ప్రయోగాలు చేసి నేర్చుకున్నారు. మరోవైపు గణితంలో సరదా అంశాలైన తప్పిపోయిన అంకె, పుట్టినరోజు తర్కం, వయస్సు రహస్యం, స్పెల్లింగ్ లాజిక్ వంటివాటిని చెప్పించారు. ఈ కార్యకలాపాల ద్వారా పిల్లలు కేవలం సమయాన్ని గడపడమే కాకుండా, వాటి వెనుక ఉన్న సైన్స్ సూత్రాలు సులువుగా తెలుసుకుంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ తరహా వర్క్‌షాప్‌ల ద్వారా పిల్లల్లో శ్రద్ధ, మెరుగైన జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, విమర్శనాత్మక ఆలోచన పెరుగుతాయని చంద్రయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో కాయిన్ మ్యాజిక్ కాజా కూడా పాల్గొనగా, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు సహకారం

మురళీనగర్: వాకర్స్ క్లబ్ నిర్వహించే సేవా కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తానని వాకర్స్ డిస్ట్రిక్ట్-101 పూర్వ గవర్నర్ కె.వెంకటరాజు తెలిపారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో ఆదివారం నిర్వహించిన క్లబ్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు సమన్వయంగా పనిచేస్తూ నడక, ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ మాట్లాడుతూ సభ్యుల ఆరోగ్యంతోపాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెంకటరాజుతోపాటు వాకర్ పొందూరు సూర్యనారాయణను సత్కరించారు. పార్కు అభివృద్ధికి తన వంతుగా రూ.5 వేలు విరాళంగా ఇస్తున్నట్లు సూర్యనారాయణ ప్రకటించారు. క్లబ్ ఉపాధ్యక్షురాలు జి.విజయలక్ష్మి, సీహెచ్‌ఎస్‌ఎస్‌వీ ప్రసాదరావు, ఎస్.ప్రకాశరావు, ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## దళిత అధికారిపై దాడి గర్హనీయం

తగరపువలస: ఇటీవల సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై దాడిని ఖండిస్తూ ఆదివారం మాల మహానాడు ఆధ్వర్యంలో భీమిలి మండలం తాళ్లవలస సర్వీస్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అధ్యక్షుడు భాగం గోపాలరావు మాట్లాడారు. దళితుడైన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై సనాతన ధర్మం పేరుతో కిషోర్ అనే న్యాయవాది బూటుతో దాడికి పాల్పడటం అమానుషమన్నారు. అలాగే తెలుగు రాష్ట్రానికి చెందిన హర్యానా కేడర్ అదనపు డీజీపీ పురాన్ కుమార్‌పై అవినీతి ఆరోపణలు చేసి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన పోలీస్ ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల హక్కులు కాపాడటంలో విఫలం అయ్యాయన్నారు. ఈ నిరసన నియోజకవర్గ కన్వీనర్ బోని సన్నిబాబు, సియ్యాద్రి రాంబాబు, బెల్లాన అప్పారావు, బోని ప్రసాద్, బోని నరసింగరావు, యాగాటి రామారావు, మామిడి భాస్కరరావు, బోని శివ, మట్టా ఆదినారాయణ, లంక పైడిరాజు పాల్గొన్నారు.


తాళ్లవలస సర్వీస్ రోడ్డులో రాస్తారోకో నిర్వహిస్తున్న మాల మహానాడు ప్రతినిధులు

## ఆసక్తికరంగా స్టోరీ టెల్లింగ్

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం పబ్లిక్ లైబ్రరీ, విద్యా భవన్స్ స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన స్టోరీ టెల్లింగ్ పిల్లలను ఉత్సాహపర్చింది. కథాకారిణి ఎం.సీతా శ్రీనివాస్ తనదైన శైలిలో చమత్కారం, తెలివితో ప్రత్యేకత సాధించిన ఒక చిన్న ఉల్లాస భరితమైన టైలర్ బర్డ్ కథను ఎంతో ఆసక్తికరంగా వివరించారు. కథ వినడమే కాకుండా వర్క్‌షాప్‌లో పిల్లలు పాటలు పాడి, పక్షులు కట్టే వివిధ రకాల గూళ్లు పరిశీలించి కొత్త విషయాలు నేర్చుకున్నారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయం కార్యదర్శి డి.ఎస్.వర్మ, పాల్గొన్నారు.

## కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, నిర్మాణానికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ జిల్లా ఇంటలెక్చువల్ విభాగం కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించింది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు దేవరకొండ మార్కండేయులు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. ప్రధానంగా విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. కోవిడ్ లాంటి విపత్తుల సమయంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందాలనే సంకల్పంతో 17 మెడికల్ కళాశాలను రాష్ట్రంలో నిర్మించేందుకు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాటలు వేశారన్నారు. అయితే ఆ మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఇది రాష్ట్ర ప్రజల ప్రజారోగ్యాన్ని తాకట్టు పెట్టడమే అవుతుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని జిల్లా ఇంటలెక్చువల్ విభాగం బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తుందన్నారు. ఈ అంశంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మద్దతు కూడగట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విభాగం అధ్యక్షుడు పిల్లా అప్పారావు, ప్రధాన కార్యదర్శి జేవీజీ సురేష్, ఉత్తరం కార్యదర్శి జి.రాధాకృష్ణ, ఏయూ విద్యార్థి నాయకుడు మోహన్, దక్షిణం నాయకుడు జాఫర్ అలీ, దక్షిణం కార్యదర్శి విజయబాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ విభాగం ప్రతినిధులు

## ఐటీఐలో కొత్త కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ప్రభుత్వ ఐటీఐలో కొత్తగా మూడు కోర్సులు ప్రారంభిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు తెలిపారు. ఎలక్ట్రానిక్ మెకానిక్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనర్ మెకానిక్, అటెండెంట్ ఆపరేటర్ (కెమికల్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటల్లోపు ఐటీఐ.ఏపీ.జీవో.ఇన్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి సర్టిఫికెట్లను పరిశీలన చేస్తామన్నారు. అలాగే పదో తరగతి ఫెయిల్ అయిన, 8వ తరగతి పాసైన వారి కోసం కార్పెంటర్, పెయింటర్, ప్లంబర్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17న ఉదయం 10 గంటలకు ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు.

## అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో ఆదివారం జరిగిన కర్ణాటక గాత్ర కచేరీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. డాక్టర్ వి.గౌరీ రామమోహన్ శిష్యురాలు వడ్డాది శ్రీహర్షిత అద్భుత గానంతో అలరించింది. శరణు సిద్ధి వినాయక, జగజ్జననీ, కమలాంబ, నీలమేఘ శరీర, ఓం నమో, గరుడధ్వని కీర్తనలు ఆలపించారు. ఈమెకు ఎం.కల్యాణ్ శశాంక్ వయోలిన్‌పై, టి.ఎస్.చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని శ్రీహర్షితను, కళాకారులను సత్కరించారు.

## దువ్వాడ రైల్వేస్టేషన్‌లో రైల్వే మెజిస్ట్రేట్ స్పెషల్ డ్రైవ్

- వెయ్యి కేసుల పరిష్కారం.. రూ.3 లక్షల జరిమానా

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో రైల్వే మెజిస్ట్రేట్ జీ.కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక క్యాంపులో వెయ్యి కేసులు పరిష్కరించారు. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో నమోదు చేసిన 1,400 కేసుల్లో ఈ వెయ్యి కేసులను పరిష్కరించి, రూ.3 లక్షల జరిమానా విధించారు. మహిళా, దివ్యాంగుల బోగీల్లో ప్రయాణించడం, అనవసరంగా అలారం లాగడం, స్టేషన్‌లో, బోగీల్లో ఆకతాయిగా వ్యవహరించడం, రైల్వే ఆవరణలో ఆక్రమణలు, నో-పార్కింగ్ జోన్‌లో వాహనాలు నిలపడం వంటి వివిధ ఉల్లంఘనలకు పాల్పడిన ప్రయాణికులు, వ్యక్తులపై ఈ కేసులు నమోదు చేశారు. ప్రత్యేక క్యాంపు ద్వారా ప్రయాణికులను అప్రమత్తం చేయడమే లక్ష్యమని దువ్వాడ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బుడుమూరు వెంకటరమణ తెలిపారు. అనంతరం రైల్వే మెజిస్ట్రేట్ కార్తీక్‌ను దువ్వాడ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, రైల్వే సిబ్బంది సత్కరించారు.


రైల్వే మెజిస్ట్రేట్ కార్తీక్‌ను సత్కరిస్తున్న దువ్వాడ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ

## ఉపాధ్యాయుని కుటుంబానికి రూ.50 వేల సాయం

తగరపువలస : గత నెల 20న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్.రాయవరం మండలానికి చెందిన ఉపాధ్యాయుడు వంకల సత్యం భార్య స్రవంతికి ఆదివారం భీమిలికి చెందిన పీఆర్‌టీయూ సభ్యులు రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. నగరంలోని ఆయన ఇంటి వద్ద ఈ మొత్తాన్ని అందించారు. గతంలో భీమిలి మండలం దిబ్బడిపాలెంలో పని చేసిన సత్యం ఇటీవల జరిగిన బదిలీల్లో ఎస్.రాయవరం మండలానికి బదిలీ అయ్యారని ఉపాధ్యాయులు తెలిపారు. ఆయన కుటుంబానికి పీఆర్‌టీయూ జిల్లా నాయకులు ఎం.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, గరికిన పరదేశి, సన్యాసినాయుడు, రొంగలి అప్పారావు, ఆల్బర్ట్ సుదర్శన్, భీమిలి నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, ఎస్.రమణారావు, ఎం.రమాదేవి, వెంకటరమణ ఆర్థిక సాయం చేశారు.


వంకల స్రవంతికి రూ.50 వేలు అందిస్తున్న ఉపాధ్యాయులు

## ఘనంగా ఆర్యవైశ్య యువజన సంఘం వార్షికోత్సవం

దాబాగార్డెన్స్: ఆర్యవైశ్య యువజన సంఘం 53వ వార్షికోత్సవం ఆదివారం పాతనగరంలోని వాసవీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వార్షికోత్స సభలో సంఘం అధ్యక్షుడు నేతి శ్రీనివాసరావు సంఘం ఆవిర్భావం గురించి తెలిపారు. ఆర్యవైశ్యుల సంస్కృతీ సాంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లే ఉద్దేశంతో వివిధ కార్యక్రమాలు చేపట్టడం, మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేయడం ధ్యేయమన్నారు. కందుల రామారావు సారథ్యంలో ప్రారంభించబడిన సంఘం 53వ వార్షికోత్సవం జరుపుకోవడం సంతోషకరమన్నారు. కార్యదర్శి కట్టమూరి సూర్యనారాయణ వార్షిక నివేదిక అందజేసి ఏడాది కాలంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. ఆర్యవైశ్య ప్రతినిధి గ్రంధి రాజేష్ మాట్లాడుతూ 53 ఏళ్ల కిందట అప్పటి పెద్దలు ముందు చూపుతో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య యువజన సంఘం నానాటికీ అభివృద్ధి చెందుతూ ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించి, వారి ఉన్నత చదువులకు చేయూతనివ్వడం, మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూరేలా కృషి చేయడం ముదావహమన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ చైర్మన్ వంకా యల జవహర్, కోశాధికారి దుర్గా సూకేశ్వరరావు, కన్యకాపరమేశ్వరి దేవస్థాన సంఘ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ సభ్యుడు విన్నకోట రామ్మూర్తి, వాసవీ కల్యాణ మండప సంఘం కార్యదర్శి నున్న గోపాల్, కల్లూరి సత్తిబాబు, కొత్త అరుణ్‌కుమార్, సన్యాసిశెట్టి పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

దాబాగార్డెన్స్: జగన్నాథ కళా సంక్షేమ సేవా సమాజం స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని ప్రేమసమాజం ఆడిటోరియంలో నిర్వహించిన నృత్య పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. పోటీలకు నగరం నుంచే కాక ఇతర జిల్లాల నుంచి డ్యాన్స్ అకాడమీలు పాల్గొన్నాయి. బ్యాడ్ బాయ్స్ ఎంటర్‌టైనర్స్, అన్నమ్మ చారిటబుల్ ట్రస్ట్, నృత్య భారతి, అభినయ ప్రియ, నవ చైతన్య, నాట్య దీపిక కూచిపూడి అకాడమీ, యారాడ జెడ్పీ హైస్కూల్, ఏయూ (వేద గాయత్రి), శివ క్లాసికల్, ముద్రా డ్యాన్స్ ఇనిస్టిట్యూట్, శాంతినికేతన్ స్కూల్, నవ చైతన్య కళా నాట్య సంఘం, కిరణ్మయి నృత్యాలయ, శ్రీ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, హరిహర నృత్యనికేతన్, లయన్స్ క్లబ్‌తో పాటు వివిధ పాఠశాలలు, డ్యాన్స్ అకాడమీల నుంచి పలువురు చిన్నారులు పాల్గొని తమ ప్రతిభ ప్రదర్శించారు.


ప్రదర్శన ఇస్తున్న బాలికలు